సాక్షి వరంగల్

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) జీపీఎస్.రాథోర్ అన్నారు. - 8లో▸



ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/24^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



గీసుకొండ: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ హెచ్చరించారు. కేఎంటీపీలో అక్రమంగా వెలసిన షాపులను గురువారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గుండుంబా, మాదకద్రవ్యాల అమ్మకం, బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట మామునూరు ఏసీపీ వెంకటేశ్, గీసుకొండ సీఐ మహేందర్, సంగెం ఎస్సై నరేశ్, సిబ్బంది ఉన్నారు.

నేడు ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం

విద్యారణ్యపురి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఖిలా వరంగల్ మండలం ఉర్సుగుట్ట సమీపంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ రంగయ్యనాయుడు తెలిపారు. జిల్లాలో 52 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, 16 మంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఉత్తమ టీచర్లుగా ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ తదితరులు పాల్గొంటారని డీఈఓ తెలిపారు.


నేడు రేషన్ షాపుల బంద్

ఖిలా వరంగల్: తెలంగాణ రేషన్ డీలర్ల అసోసియేషన్ రేషన్ షాపుల బంద్‌కు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లాలోని 509 రేషన్ షాపులు మూతపడనున్నాయి. ఎన్నికలకు ముందు తమకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం ఇస్తామని, కమీషన్ పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన 21 నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా ధారావత్ మోహన్‌నాయక్ పేర్కొన్నారు. డీలర్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, దుకాణాల అద్దె, బియ్యం దిగుమతి చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ఐదు నెలలుగా రేషన్ షాపుల్లో పాడైపోతున్న దొడ్డు బియ్యం నిల్వలను తరలించేందుకు నిర్ణయం తీసుకోవాలని, క్వింటాలుకు రూ.140 నుంచి రూ.300కు కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఒక రోజు బంద్‌తోనైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని మోహన్‌నాయక్ హెచ్చరించారు.

7న భద్రకాళి దేవాలయం మూసివేత

హన్మకొండ కల్చరల్ : భాద్రపద శుద్ధ పూర్ణిమ ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతున్నందున భద్రకాళి దేవాలయాన్ని ఆరోజు మధ్యాహ్నం 1 గంటకు పూజల అనంతరం మూసివేయనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ రామల సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణమోక్షానంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి సోమవారం ఉదయం 7 గంటలకు భక్తులకు సర్వదర్శనం, అర్జిత సేవలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

జిల్లాకు ఎస్సారెస్పీ జలాలు



హసన్‌పర్తి: ఎస్సారెస్పీ జలాలు గురువారం సాయంత్రం జిల్లాకు చేరాయి. చివరి (ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు) ఆయకట్టు వరకు నీరందించనున్నట్లు అధికారులు తెలిపారు. లోయర్ మానేరు నుంచి 3,000 క్యూసెక్కుల నీరు విడుదలైనట్లు, వార బందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

సమాజానికి మార్గనిర్దేశకులు

గురువు అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానం అనే వెలుగును ప్రసాదిస్తాడు. అంతటి ఉన్నత స్థానం కలిగిన ఆయనకు సమాజంలో మంచి స్థానం ఉంది. విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించి ఉత్తములుగా తీర్చిదిద్దుతాడు. వారి కలలను నిజం చేసే మార్గనిర్దేశకుడు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తున్న పలువురి ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..



స్ఫూర్తి ప్రదాత రవికుమార్



రవికుమార్

నర్సంపేట: నర్సంపేట పట్టణానికి చెందిన కాసుల రవికుమార్ ఖానాపురం మండలం బుధరావుపేట ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన లీడ్ ఫౌండేషన్‌ను స్థాపించి 18 సంవత్సరాలుగా నిరుపేద విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాస తరగతులను బోధిస్తున్నారు. 'గ్లోబ్ ఇంగ్లిష్ గ్రామర్' పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా అందించారు. తన స్వగృహంలో పిల్లల కోసం సుమారు 30 వేల పుస్తకాలతో లీడ్ గ్రంథాలయంతోపాటు లీడ్ సంచార గ్రంథాలయం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 40కి పైగా లీడ్ గ్రామీణ గ్రంథాలయాలను నెలకొల్పారు. గ్రామాల్లోని విద్యార్థుల కోసం తన కారును సంచార గ్రంథాలయంగా తీర్చిదిద్ది, గ్రామీణ ప్రజలకు విద్య ప్రాధాన్యతను తెలియజేస్తున్నారు. సేవా కార్యక్రమాల కోసం రవికుమార్ ప్రతీ నెల తన వేతనంలో 33 శాతం కేటాయిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

మరిన్ని కథనాలు : 8లో

అంకితభావం.. శ్రీదేవి సొంతం



ఒడపల్లి శ్రీదేవి, ప్రధానోపాధ్యాయురాలు

నల్లబెల్లి: మండలంలోని రాంతీర్థం ప్రాథమిక పాఠశాలలో 2022 జనవరిలో హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన ఒడపల్లి శ్రీదేవి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. సొంత ఖర్చులతో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థుల సంఖ్యను 40 వరకు పెంచారు. మేరుగు రాము–ప్రియాంక దంపతుల ఇద్దరు పిల్లలతో పాటు పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేవారు. వారికి శ్రీదేవి పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు బంద్ చేసి ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. పాఠశాలలో మూడు తరగతి గదులు ఉండగా రెండు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్నాయి. మిగిలిన ఒకే గదితో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అందించిన విరాళాలతో మరమ్మతులు చేయించారు. ఈనెల 3న ఎంఈఓ అనురాధ చేతుల మీదుగా హెచ్ఎం శ్రీదేవి గదులను ప్రారంభింపజేశారు.

వ్యాధుల కాలం జాగ్రత్త..

- పొంచి ఉన్న డెంగీ, మలేరియా, అతిసార
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- పెరుగుతున్న జ్వరపీడితుల సంఖ్య
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

గీసుకొండ: విస్తారంగా కురిసిన వర్షాలతో పల్లెలు, పట్టణాల్లోని మురికివాడల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో పరిసర ప్రాంతాలు, రోడ్లు చిత్తడిగా మారాయి. డ్రెయినేజీలు లేని చోట మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. పలు ప్రాంతాల్లోని గుంతలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచి దోమలు, ఈగలకు నిలయంగా మారుతున్నాయి. ఈ క్రమంలో కీటకజనిత వ్యాధులతోపాటు డయేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. దోమల ద్వారా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు, కలుషిత ఆహారం, తాగునీటితో డయేరియా సోకి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. జ్వరం, డయేరియా సోకితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, హెల్త్ సబ్‌సెంటర్లకు వెళ్లాలని సూచిస్తున్నారు.

వరంగల్ నగరంలో సమస్యాత్మక ప్రాంతాలు..

వరంగల్ నగర పరిధిలో డెంగీ సోకే సమస్యాత్మక ప్రాంతాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. దేశాయిపేట అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ (యూపీహెచ్‌సీ) పరిధిలో సీకేఎం కళాశాల ప్రాంతం, ఎల్‌బీనగర్, ఎంహెచ్ నగర్, కాశిబుగ్గ యూపీహెచ్‌సీపరిధిలో సొసైటీ కాలనీ, పద్మనగర్, కీర్తినగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ఎన్‌టీఆర్‌నగర్ తోపాటు ఎంజీఎం ప్రాంతంలోని రామన్నపేట, కొత్తవాడ, మట్టెవాడ, ఖిలా వరంగల్, రంగశాయిపేట, శంభునిపేట, గణేశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో డెంగీ సోకే అవకాశాలు ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో..

పర్వతగిరి, నెక్కొండ, అప్పల్‌రావుపేట, గీసుకొండ గ్రామం, వర్ధన్నపేట, చెన్నారావుపేట, జల్లి, నందిగామ, నర్సంపేట ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి.

పెరుగుతున్న కేసులు..

ఆగస్టు నెలలో జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలతోపాటు పల్లె, బస్తీ దవాఖానలకు పరీక్షలు చేయించుకోవడానికి 50,271 మంది వెళ్లారని వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వారిలో జ్వరపీడితులు, డయేరియా, టైఫాయిడ్, డెంగీ, జలుబు తదితర సమస్యలు ఉన్నవారే అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.



ఖానాపురం : మంగళవారిపేటలో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది

టెలీఫాస్ కీటక నాశిని మందు స్ప్రే..

డెంగీ, మలేరియా సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో దోమల లార్వాలను నిర్మూలించడానికి టెలీఫాస్ అనే కీటక నాశిని మందును స్ప్రే చేస్తున్నట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి మాడిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట సబ్ యూనిట్ల పరిధిలో దోమల నివారణ కోసం పైరిత్రమ్, ఆల్ఫా సైఫర్ మిత్రేన్ (5 శాతం)తో పాటు టెలిఫాస్ మందులను అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతీ పీహెచ్‌సీ, సబ్ సెంటర్ పరిధిలో మలేరియా వ్యాధి నిర్ధారణ కోసం ఆర్‌టీడీ కిట్లు, వ్యాధి నివారణ మందులను అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రజలు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని వారు సూచిస్తున్నారు.

జిల్లాలో మూడు నెలల్లో నమోదైన కేసుల వివరాలు..

నెల	డెంగీ	డయేరియా	మలేరియా	టైఫాయిడ్	జ్వరం	జలుబు
జూన్	11	67	0	71	105	67
జూలై	14	219	1	85	421	126
ఆగస్టు	55	391	1	94	802	314
	80	677	2	250	1,328	507

రాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేశాం..



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణ కోసం జిల్లా, మండల (పీహెచ్‌సీ), సబ్‌సెంటర్ల వారీగా రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్‌శాఖ, పట్టణాల్లో మున్సిపల్ అధికారుతో కలిసి పనిచేస్తున్నాం. ఈ సీజన్‌లో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. పనిచేసే చోట ఉంటూ సమయపాలన పాటించడంతోపాటు సత్వర వైద్య సేవలు అందించడానికి సిద్ధం కావాలి. పాము, తేలు, కుక్కకాటుతోపాటు అవసరమైన అన్ని మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి. ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాం.

– బి.సాంబశివరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

సంగెం: వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ ఆదేశించారు. ఎల్గూర్‌రంగంపేట చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో 166 వినాయక విగ్రహాల నిమజ్జనానికి చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. చిన్న పిల్లలు, ఈతరాని వారు నిమజ్జనం సమయంలో చెరువుల వద్దకు వెళ్లకుండా చూడాలని, ఈత వచ్చిన వారిని మాత్రమే చెరువుల వద్దకు పంపించాలని కమిటీలకు సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారి డీజేలు సీజ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. డీజేలు కాకుండా బ్యాండ్‌మేళాలు, డప్పు చప్పుళ్లు, కోలాటాలతో ఊరేగింపు చేసుకోవాలని, నిమజ్జనం రాత్రి 10 గంటల వరకు ముగించాలని కమిటీలను కోరారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ వెంకటేశ్, సంగెం ఎస్సై నరేశ్, మాజీ సర్పంచ్ జనగాం రమేశ్ పాల్గొన్నారు.

కట్టమల్లన్న చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం కట్టమల్లన్న చెరువు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను ఈస్ట్‌జోన్ డీసీపీ ఐపీఎస్ అంకిత్ కుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. వినాయకుడిని శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు. చెరువులో వదిలే తెప్ప, క్రేన్, జేసీబీల ఏర్పాటును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మామునూరు ఏసీపీ వెంకటేశ్, గీసుకొండ సీఐ మహేందర్, పోలీసు, బల్దియా, రెవెన్యూ, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సంగెం : నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు



గణపతి శోభాయాత్రలో అమ్మవారి వేషధారణలో నృత్యం చేస్తున్న కళాకారులు

నెక్కొండ: జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొమ్మిదో రోజు గురువారం వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేట, మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద ఉత్సవ నిర్వాహకులు అన్నదానం చేశారు. నెక్కొండ మండల కేంద్రంలో యువత యూత్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ గణపతి లడ్డూ డ్రా తీశారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణలో భక్తుల నృత్యాలు విశేషంగా అలరించాయి. అలాగే, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణేశ్‌కు 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, ఎస్సై మహేందర్, యువత యూత్ అధ్యక్షుడు శ్రీరంగం సంపత్ పాల్గొన్నారు.

కేఎంటీపీని సందర్శించిన అధికారులు

గీసుకొండ: గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో నెలకొల్పిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను సాన్ ఫ్రాన్సిస్కో, బ్రూనై దేశాల్లోని భారత రాయభార(దౌత్య) కార్యాలయాల అధికారులు గురువారం సందర్శించారు. కలెక్టర్ సత్యశారద వారిని గైడ్ చేయగా.. ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారులు శ్రీకర్ రెడ్డి, రాములు అబ్బగాని కేఎంటీపీలో నెలకొల్పిన గణేశా, యంగ్‌వన్, కిటెక్స్ కంపెనీల్లో ఉత్పత్తిని పరిశీలించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేఎంటీపీలో జరుగుతున్న అభివృద్ధి, ఉత్పత్తిని అధికారులు వివరించారు. త్వరలో కేఎంటీపీలోని వస్త్ర పరిశ్రమలు ప్రపంచస్థాయిలో ఎగుమతులు చేసే విధంగా ఎదుగుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామినాయక్, గీసుకొండ, సంగెం తహసీల్దార్లు ఎండీ రియాజుద్దీన్, రాజ్‌కుమార్, గణేశా ఎండీ కేఎస్ రెడ్డి, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గణేశా కంపెనీలో దౌత్య కార్యాలయాల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై సమావేశం

న్యూశాయంపేట: ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇంజనీరింగ్ బృందం ప్రిలిమినరీ సర్వేలో భాగంగా గురువారం మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించింది. అనంతరం బృందం సభ్యులు కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో ఏఏఐ ఏజీఎంలు నటరాజ్, మనీష్ జోన్వాల్, మేనేజర్లు ఓం ప్రకాశ్, రోషన్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం వెతలు

- ధర్మరావుపేటలో సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతులు

ఖానాపురం: యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మరావుపేట, మంగళవారిపేట గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి బారులు తీరారు. మంగళవారిపేటలో 444, ధర్మరావుపేటలో 444 బస్తాల యూరియాను గురువారం రైతులకు పంపిణీ చేశారు. మంగళవారిపేటలో క్యూలో ఉన్న వారికి బస్తాలు ఇవ్వడం లేదని రైతులు ఆగ్రహించారు. గోదాం లోపలకు వెళ్లి వ్యవసాయ విస్తరణ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారుల వద్ద ఉన్న డబ్బులను లాగేయడంతో కిందపడిపోయాయి. దీంతో అప్రమత్తమైన సొసైటీ సిబ్బంది డబ్బులను తీసి బ్యాగులో పెట్టారు. గోదాంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకునే క్రమంలో అప్రమత్తమైన ఎస్సై రఘుపతి రైతులను బయటకు పంపించారు. షటర్ మూసివేసి క్యూలో ఉన్న వారికి బస్తాలను అందించేలా చర్యలు చేపట్టారు. ధర్మరావుపేటలో క్యూలో తోపులాట చోటుచేసుకుంది. దీంతో మహిళా రైతులు కిందపడిపోవడంతో గాయాలపాలయ్యారు. గాయపడిన రైతులు గుగులోత్ వినోద, ఊడుగుల సునీత, దేవక్కతోపాటు మరికొంత మందిని కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు తరలించారు.



ధర్మరావుపేటలో సొమ్మసిల్లిన మహిళా రైతు సునీతను ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

రైతులకు అండగా నిలిచిన ఎస్సై రఘుపతి

యూరియా కోసం మంగళవారిపేటకు చెందిన రైతులు దుప్పట్లతో బుధవారం రాత్రి 8 గంటల నుంచే సొసైటీ గోదాం వద్ద బారులు తీరారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఛాగర్ల రఘుపతి రైతుల వద్దకు వెళ్లారు. రాత్రి సమయంలో రైతులు ఇబ్బందిపడొద్దని ఆలోచించారు. రాత్రి 12 గంటలకు రైతుల ఆధార్‌కార్డులు తీసుకున్నారు. సీరియల్ ప్రకారం తీసుకుని రైతులను ఇంటికి పంపారు. గురువారం ఉదయం కార్డుల ప్రకారం రైతులకు యూరియా పంపిణీ చేయించారు. దీంతో రైతులు ఎస్సైకి ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన గ్రామాల రైతులు కూడా ఎస్సై వద్దకు వచ్చి ఇదే పద్ధతి అమలు చేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



ఎస్సై రఘుపతితో మాట్లాడుతున్న రైతులు

పేదలకు మెరుగైన వైద్యసేవలు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు ప్రారంభం

నర్సంపేట రూరల్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. నర్సంపేట పట్టణం సర్వాపురం గ్రామ శివారులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. త్వరలోనే మరిన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సీటీ స్కాన్ కోసం ఇకపై వరంగల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద

నానో యూరియాతో అధిక లాభాలు

పంటలకు నానో యూరియా పిచికారీ చేస్తే అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద అన్నారు. డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీపై గురువారం గురిజాలలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వివిధ పంటలకు నానో యూరియా వాడితే ఖర్చు, శ్రమ తగ్గుతుందన్నారు. యూరియా కంటే నానో యూరియా మెరుగ్గా పనిచేస్తుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు వీరే..

కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఎంపికైన వారిని గురువారం ప్రకటించింది. శుక్రవారం వీరికి హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో జరిగే వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించనున్నారు. ఇందులో కేయూలోని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళా శాల కెమిస్ట్రీ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లారం అరుణ, ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రశాంతి, హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాలోతు గన్‌సింగ్ హనుమకొండ జిల్లాలోని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హిస్టరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్ మల్లయ్య ఎంపికయ్యారు.

పరిశోధనల్లో మేటి..

కేయూలోని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ పరిశోధనల పరంగా 12 పేటెంట్లు కలిగి ఉన్నారు. వీటిలో క్యాన్సర్ బయాలజీపై పరిశోధనలు చేశారు.

బోధనలో ఘనాపాటి

హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లారం అరుణ రెండు జాతీయ సదస్సులు నిర్వహించారు. కెమిస్ట్రీకి సంబంధించిన పది పాఠ్య పుస్తకాలు రచించారు.

రాలేవ్వరు సాటి..

పింగిళి కళాశాల కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.ప్రశాంతి విద్యార్థులకు సృజనాత్మక డిజిటల్ పద్ధతుల ద్వారా కెమిస్ట్రీ బోధిస్తున్నారు.

సులభ గణితం.. ఆ సార్ స్పెషాలిటీ


విద్యార్థులకు గణితంలో సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్


జనగామ రూరల్: ఈ ఫొటోలో విద్యార్థులతో కనిపిస్తున్న ఉపాధ్యాయుడి పేరు అల్లూరి రవీందర్. జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. పాఠశాల స్థాయిలో పిల్లలకు గణితం అంటే భయం. వారిలో ఆ భయాన్ని తొలగిస్తేనే ఆ శాస్త్రం నేర్చుకోవడానికి ఆసక్తి కనబర్చుతారు. దీనిని గమనించిన టీచర్ రవీందర్.. 12 సంవత్సరాల నుంచి గణితం సులువుగా అర్థమయ్యేందుకు ఆ శాస్త్ర నమూనాలు తయారు చేసి బోధిస్తున్నారు. బట్టీపట్టే విధానం కాకుండా కృత్యాధార పద్ధతిలో గణితం బోధించడం ఆయన ప్రత్యేకత. 200కి పైగా గణిత మోడల్స్ తయారు చేసి బోధన సమయంలో ఉపయోగిస్తున్నానని రవీందర్ చెబుతున్నారు. కాగా, బెంగళూరు, చెన్నైలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో రవీందర్ రెండు సార్లు బహుమతులు గెలుచుకున్నారు.

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయుడు


వ్యాన్‌లో పాఠశాలకు విద్యార్థులను తీసుకొస్తున్న ఉపాధ్యాయుడు

గూడూరు: అతనో మారుమూల ఏజెన్సీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. ఎక్కడ పనిచేసినా విద్యాభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తారు. అతనే గూడూరు మండలం రాజనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి. యాకూబ్. పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచాలనుకున్న సహచర ఉపాధ్యాయుల నిర్ణయానికి యాకూబ్ తన అభిప్రాయం తెలిపారు. తాను సొంత డబ్బులు రూ. లక్షా 50 వేలు వెచ్చించి ఓ వ్యాన్ కొనుగోలు చేశారు. అంతేకాకుండా విద్యార్థులను రోజూ పాఠశాలకు తీసుకొచ్చి సాయంత్రం ఇంటి వద్ద చేర్చుతూ తానే వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దీంతో గతంలో ఆ పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, వ్యాన్ కొనుగోలు తర్వాత ఆ సంఖ్య 75కి పెరిగింది. కాగా, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుడే డ్రైవర్‌గా మారడంపై ఉన్నతాధికారులు గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.





- ప్రభుత్వ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న టీచర్లు
- నాణ్యతగా, వినూత్నంగా బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు

పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. నాణ్యత, వినూత్నంగా బోధిస్తేనే విద్యార్థులకు అర్థమవుతుంది. అప్పుడే వారు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. మంచి ఉపాధ్యాయులుగా దేశ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ఈ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి కొందరు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తూ వెలుగులు నింపుతున్నారు. ఈ క్రమంలో నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలా బోధిస్తున్న పలువురు ఉపాధ్యాయులపై 'సాక్షి' స్ఫూర్తిదాయక కథనాలు.

తల్లిదండ్రులను ఒప్పించి.. విద్యార్థుల సంఖ్య పెంచి


గంగాధర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వేముల గంగాధర్ విద్యార్థుల సంఖ్య పెంచారు. నెక్కొండ ప్రాథమిక పాఠశాల నుంచి గతేడాది బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించారు. మెరుగైన బోధన చేస్తామని, ఒక సంవత్సరం అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. ఇలా విద్యార్థుల సంఖ్య 10 నుంచి 36 వరకు పెంచారు. అదే విధంగా 10 మంది ఐదేళ్ల చిన్నారులు కూడా ప్రీప్రైమరీ స్కూల్‌కు వచ్చే విధంగా ఆయన కృషిచేశారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంలో ఐడెంటిటీ కార్డులు, టైలు, బెల్టులు అందించారు. ఇక తమ గ్రామ ఉన్నత పాఠశాలకు బేస్ గట్టిగా ఏర్పడింది. మరో ఐదేళ్ల పాటు బడి బతుకుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యార్థులతో ఫిజికల్ సైన్స్ టీచర్ రాజేందర్ అద్భుతాలు..


వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్.. విద్యార్థులతో అద్భుతాలు చేసి జూన్ 29న వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలపై నిర్వహించిన దశవధానంపై చేసిన అంశం ఆకట్టుకుంది. మరో 12 మంది విద్యార్థులు రసాయనశాస్త్రంలోని 118 మూలకాల పేర్లు 8 సెకన్ల వ్యవధిలో చదివారు. ఇందుకుగాను 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' చోటులో లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అక్షయ.. భౌతికశాస్త్రంలో ఒకేసారి పది మంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మధ్యలో ఇతర అంశాలతో మిళితంగా సమాధానాలు ఇవ్వడమేకాక, శాస్త్రవేత్తల పేర్లు, చిత్రాలను గుర్తుపెట్టుకొని అద్భుతంగా వివరించిన విధానం ఆకట్టుకుంది.

బడిని బాగు చేసి.. విద్యార్థులను తీర్చిదిద్ది


రాజేశ్


2018లో ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు టి.రాజేశ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నేడు హైదరాబాద్‌లోని శిల్పారామంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. రాజేశ్ బాధ్యతలు స్వీకరించిన సమయంలో స్కూల్‌లో జీరో స్ట్రెంత్ ఉంది. దీంతో పాఠశాలను బాగుచేసి పిల్లలను బడిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2018లో జీరో స్ట్రెంత్ స్కూల్‌ను రీఓపెన్ చేసి రూ.40 వేలు సొంత డబ్బులు వెచ్చించి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించారు. సహచార ఉపాధ్యాయుడు విజయ్‌భాస్కర్ సాయంతో ఇంటింటికీ తిరిగి 15మంది పిల్లలను బడిలోకి తీసుకొచ్చాడు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు. దీంతో 2023లో జిల్లా స్థాయిలో టీచింగ్ లార్నింగ్ మెటీరియల్ తయారు చేయగా జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. జూలైలో ఢిల్లీలో జరిగిన సీసీఆర్‌టీ ట్రైనింగ్ ప్రోగ్రాంకు తెలంగాణ నుంచి 10 మంది వెళ్లగా అందులో రాజేశ్ ఉన్నారు.

నాలుగేళ్ల తర్వాత తెరుచుకున్న బడి..


విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ భిక్షపతి (ఫైల్)

శాయంపేట: మండలంలోని కొప్పులలో నాలుగేళ్ల క్రితం మూతబడిన గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను జూన్ 30న ఎంఈఓ భిక్షపతి తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వ విద్యను బతికించే ప్రయత్నం చేయడం అభినందనీయమని, విద్యే ప్రగతికి సోపానమని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలనే ఉద్దేశంతో ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తిరిగి తెరిపించారు. నాలుగేళ్లుగా మూతబడిన బడిని ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని తెరిపించినందుకు మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే సీఈఎల్ఈ రాథోర్
- కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ తనిఖీ


సీఈఎల్ఈ రాథోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే మజ్దూర్ యనియన్ నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) బి.పి.ఎస్.రాథోర్ అన్నారు. గురువారం సీఈఎల్ఈ షెడ్‌లో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం లోకోల నిర్వహణ పనితీరుపై విజయవాడ, లాలాగూడ, మౌలాలి, కాజీపేట డీజిల్‌షెడ్, ఎలక్ట్రిక్‌షెడ్ నుంచి పాల్గొన్న అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాగా, షెడ్ అభివృద్ధి, రైల్వే కార్మికుల సమస్యలను స్థానిక షెడ్ సీనియర్ డీఈఈ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

సీఈఎల్ఈకి నాయకుల వినతి

సీఈఎల్ఈ రాథోర్‌కు రైల్వే మజ్దూర్ యనియన్ కాజీపేట ఈఎల్ఎస్ బ్రాంచ్ నాయకులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. షెడ్‌లో లోకోల నిర్వహణకు సరిపడా స్టాఫ్ పెంచాలని, ఈఎల్ఎస్‌కు వచ్చే మార్గంలో రైల్వే ట్రాక్‌పై ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని, వెహికిల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలనే తదితర సమస్యలను వివరించారు. దీనిపై సీఈఎల్ఈ స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం, చైర్మన్ ఇబ్రహీం తెలిపారు. కార్యక్రమంలో ఈఎల్ఎస్ బ్రాంచ్ ట్రెజరర్ బి.రవీందర్‌రెడ్డి, ఆఫీస్ బేరర్స్ వైస్ చైర్మన్ ఎస్.గోపి, ప్రభాకర్, ఎస్.స్వర్ణకుమారి, అసిస్టెంట్ సెక్రటరీ పి.రాజు, అరుణ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

12న ఆర్టీసీల పరిరక్షణ దినం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

న్యూశాయంపేట: దేశంలోని 59 ఆర్టీసీ (రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్)లను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన చేపట్టనున్న ఆర్టీసీల పరిరక్షణ దినాన్ని(సేవ్ ఆర్టీసీ) విజయవంతం చేయాలని వరంగల్ రీజియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.ఎల్లయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీలకు సంబంధించి కొన్ని విలువైన భూములు ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని దాదాపు 59 ఆర్టీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం లేదని, ఫలితంగా ఆర్టీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీంతో కార్మికులు పని భారం పెరిగి అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. అందుకోసం ఈనెల 12న ఆర్టీసీల మనుగడ కోసం 'ఆర్టీసీల పరిరక్షణ దినం' (సేవ్ ఆర్టీసీ)డిమాండ్ డే పాటించాలని, ఆ రోజున కార్మికులందరూ నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. రీజియన్ కార్యదర్శి బి.ఉపేంద్రాచారి, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, పి.మహేందర్, కొమ్మాలు, ఎండి.పాషా, సాధిక్, రవి, సంపత్, శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

- వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ఉత్సాహంగా ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు


మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


పాల్గొన్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పరిపాలనభవనంలోని సెనెట్‌హాల్‌లో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 వసంతాల్లో ఫార్మసీ కాలేజీ స్ఫూర్తిదాయకమైన అధ్యాపకులు, విద్యార్థులను అందించిందని కొనియాడారు. ఫార్మసీలో ఇంకా మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు జరగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్ విశ్రాంత ఆచార్యులు పరమేశ్వర్ మాట్లాడుతూ ఫార్మసీ కాలేజీ ఎంతోమంది గొప్ప విద్యార్థులను అందించిందని గుర్తుచేశారు. యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జె. రాజమౌళి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా ఈ కళాశాలను నిలబెట్టుకున్నామన్నారు. కేయూ ఫార్మసీ అలుమ్ని వైస్ ప్రెసిడెంట్ ఏవీ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం పూర్వ విద్యార్థుల సంఘం పనిచేస్తుందన్నారు. ప్రొఫెసర్ రామ్‌బహూ మాట్లాడుతూ ఫార్మసీ రంగం ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. విశ్రాంత ఆచార్యులు ఎ.వి.ఎన్ అప్పారావు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు రుణపడి ఉంటామన్నారు. విశ్రాంత ఆచార్యులు మల్లారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులను చూసి గర్విస్తున్నామన్నారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు (అకుట్) బి. వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల చైర్మన్, ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి, కన్వీనర్ గాదెసమ్మయ్య మాట్లాడారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వన్నెతెచ్చిన ఫార్మసీ కాలేజీలో గొప్పపరిశోధనలకు అవకాశాలున్నాయన్నారు. ఆచార్యులు వై. నర్సింహారెడ్డి, ఎన్ ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం వెళ్తే బంగారం పోయింది..

- విశ్వనాథపురం సమీపంలో చైన్‌స్నాచింగ్
- మూడున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన దుండగుడు


వివరాలు సేకరిస్తున్న క్రైం విభాగం సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఓ మహిళ యూరియా తీసుకెళ్తుండగా చైన్‌స్నాచింగ్ జరిగింది. దుండగుడు ఆమె మెడలోనుంచి మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన మండలంలోని విశ్వనాథపురం సమీపంలో జరిగింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సముద్రాల శివారులోని నారాయణపురం గ్రామానికి చెందిన కత్తుల రాజమ్మ తన భర్త యాదగిరితో కలిసి గురువారం యూరియా కోసం స్టేషన్‌ఘన్‌పూర్ వచ్చింది. యూరియా తీసుకుని అదే రోజు సాయంత్రం దంపతులు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై సముద్రాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ బైక్‌పై వారి వెనుక వచ్చిన దుండగుడు విశ్వనాథపురం సమీపంలో రాజమ్మ మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటనలో సదరు మహిళ ద్విచక్రవాహనంపై కింద పడి స్పృహ తప్పింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహలోకి వచ్చిన అనంతరం లబోదిబోమని రోదించింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు. క్రైం విభాగం సీఐ రాఘవేందర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

యూరియా బస్తాలు మాయం

- పొగుళ్లపల్లి పీఏసీఎస్‌లో ఘటన


సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి పీఏసీఎస్‌కు సరఫరా అయిన యూరియాలో 94 బస్తాలు మాయమయ్యాయి. ఏఓ ఉదయ్, ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు బుధవారం సాయంత్రం యూరియా పంపిణీ చేశారు. పంపిణీ నిలిపివేయాలనుకునే సమయానికి గోదాం వైపునకు రైతులు ఒక్కసారిగా పరుగులు తీశారు. దీంతో ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో తనిఖీ చేయకుండా గోదాం మూసివేశారు. మరుసటి రోజు వచ్చి లెక్క చూడగా సరికి 94 బస్తాల తేడా వచ్చింది. దీంతో సీసీ ఫుటేజీని పరిశీలించిన అధికారులు.. హమాలీలను విచారించగా 34 మంది తమ అసరాలకు అనుగుణంగా తీసుకున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి రికవరీ చేసి పంపిణీ చేశారు. కాగా, యూరియా మాయంపై విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తాలు ఒక నాయకుడికి ఇచ్చి హమాలీలను కారణంగా చూపుతున్నారనే చర్చ సాగుతోంది.


రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్టుకు గాయాలు


తీవ్ర గాయాలతో రబ్బాని పాషా

ధర్మసాగర్: రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్ట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్‌లో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రబ్బాని పాషా రాంపూర్ శివారులోని సాక్షి వరంగల్ యూనిట్ కార్యాలయంలో డెస్క్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో రాంపూర్ శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రబ్బాని పాషా ఆరోగ్యం విషమంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

చాక్లెట్ కొనుక్కొని వస్తూ మృత్యుఒడికి..

- లారీ ఢీకొని బాలుడి దుర్మరణం
- గోవిందరావుపేటలో ఘటన


హర్షసాయి(ఫైల్)

గోవిందరావుపేట: చాక్లెట్ కొనుక్కొని వస్తూ ఓ బాలుడు మృత్యుఒడికి చేరాడు. లారీ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోవిందరావుపేటకు చెందిన చెన్ను నర్సింహరావు తన ఇంటి నిర్మాణం కోసం ఇటుక ఆర్డర్ చేయడానికి వెళ్లే క్రమంలో తోడుగా మనువడు కొప్పనాతి హర్షసాయి (4)ని వెంట తీసుకెళ్లాడు. ఈ క్రమంలో హర్షసాయి కిరాణా షాపులో చాక్లెట్లు తీసుకుని రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో ఏటూరునాగారం నుంచి వరంగల్ వైపునకు వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నెల క్రితం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇదే ప్రదేశంలో అల్లే వెంకటేష్ (17) మృతి చెందాడు. ఈ ప్రాంతంలో తరచూ రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గూడ్స్ షెడ్‌కు ఎరువుల రాక

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు గురువారం ఎరువులు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు 2లక్షల 35వేల యూరియా బస్తాలు చేరుకున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం వరంగల్ గూడ్స్ షెడ్‌కు చంబల్ కంపెనీ ఎంఓపీ(పొటాష్)1,079.400 మెట్రిక్ టన్నులు చేరుకోగా.. కోరమండల్ కంపెనీ చెందిన 28.28.0 రకం 483.300 మెట్రిక్ టన్నులు, 20,20,013 రకం 1,350.000 మెట్రిక్ టన్నుల ఎరువులు చేరుకున్నాయి. ఈ ఎరువులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారి రవీందర్ తెలిపారు.

దేవాలయ భూముల్లో భవనాలు ఖాళీ చేయాలి

- గోవిందరాజుల గుట్ట భూమి ఆక్రమణపై దేవాదాయ శాఖ నోటీసులు


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని చారిత్రక గోవిందరాజుల గుట్ట దేవాలయ భూముల ఆక్రమణలపై మల్లగుల్లాలు పడిన దేవాదాయశాఖ అధికారులు ఎట్టకేలకు కదిలారు. దేవాలయానికి చెందిన భూములపై పలుమార్లు సర్వే చేసిన అధికారులు.. రెండు రోజుల క్రితం వ్యాపార సంస్థలు, ఇళ్లవాసులకు నోటీసులు జారీ చేశారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 15/1, 15/2. 38లో సుమారు 8 ఎకరాలు ఉందని నిర్ధారించారు. అయితే సర్వేలో 5 ఎకరాల 25 గుంటలు మాత్రమే తేలింది. మిగతా స్థలంలో అక్రమంగా వ్యాపార సంస్థలు, నివాస గృహాలను నిర్మించుకున్నట్లు భావిస్తున్నారు. సుమారు 54 నిర్మాణాలుండగా, అందులో 15 వ్యాపార సంస్థలు, 39 నివాస గృహాలు ఉన్నాయి. వీరందరూ వ్యాపార సంస్థలు, నివాసాలను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేయగా, కొంత మంది స్వీకరించగా, మరికొందరు నిరాకరించారు.

సీపీఎం నేతలు, గృహ యజమానుల నిరసన

గోవిందరాజుల గుట్ట చుట్టూ ఉన్న నివాస గృహాలకు దేవాదాయ శాఖ అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీస్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆలయ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. 120 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి 54 కుటుంబాలకు అకస్మాత్తుగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి ఆందోళన గురిచేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు బాబు, మాధవి, కుమార్, శివ, సంపత్, రమేశ్,యాదగిరి, రామ సరోజన, సదానందం, గోవర్ధన్ పాల్గొన్నారు.